# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :10 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: మంగళవారం 04-03-2025 | పేజీలు:4 వెల: 2.00


## మున్సిపల్ వార్డు అధికారుల పే స్కేళ్లను సవరించాలి

పెద్దపల్లి: రాష్ట్రంలోని మున్సిపల్ శాఖలో గ్రూప్-4 ద్వారా నియామకమైన వార్డ్ ఆఫీసర్స్ తమ పే స్కేల్స్ సవరణ చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు పీఆర్సీ కమిషన్‌కు పోస్ట్ కార్డుల ద్వారా విజప్తి చేశారు. రాష్ట్రంలోని మున్సిపాలిటీల్లో మున్సిపల్ వార్డ్ అధికారి అనే నూతన పోస్టును క్రియేట్ చేసి జీవో ఎంఎస్ నంబర్ 109 (జులై2000) ద్వారా గ్రూప్-4లో 1862ను నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. గ్రూప్-4 ద్వారా నియమితులయ్యారంటే జానియర్ అసిస్టెంట్ కేడర్ ఉంటుందని కొత్తగా నియమితులైన వార్డు ఆఫీసర్లు చెబుతున్నారు. డిగ్రీ ఉత్తీర్ణులైన వారు గ్రూప్-4 ద్వారా నియాకం అయిన వార్డు అధికారులకి జానియర్ అసిస్టెంట్‌కు ఇస్తున్న పేస్కేల్ (రూ. 24,250- రూ. 72,850) (. 22.240- 5. 67,300). ఇంటర్ అర్హతతో ఇచ్చే రికార్డు అసిస్టెంట్ స్కేల్ ని డిగ్రీ అర్హతతో ఇస్తున్నారని పెద్దపల్లి వార్డ్ ఆఫీసర్లు స్కేల్ ని సరి చేయాలని పీఆర్సీకి వార్డు ఆఫీసర్లు విన్నవించారు. సమాన విద్యార్హతతో ఒకే నియామక పరీక్ష రాసిన వారికి ఈ వ్యత్యాసం ఎందుకని వార్డ్ ఆఫీసర్స్ ప్రశ్నిస్తునారు.

# గుజరాత్‌లో ప్రధాని మోడీ పర్యటన..



గాంధీనగర్,మార్చి3: ప్రధాని నరేంద్ర మోదీ తన సొంత రాష్ట్రం గుజరాత్‌లో మూడు రోజుల పర్యటనలో ఉన్నారు. ప్రపంచ వణ్యప్రాణి దినోత్సవం సందర్భంగా సోమవారం ఉదయం ప్రధాని మోదీ జునాగఢ్ జిల్లాలోని గిర్ వణ్యప్రాణి సంరక్షణ కేంద్రానికి వెళ్లారు. అందులోభాగంగా ఆయన లయన్ సఫారీ చేశారు. ఆయనతో పాటు పలువురు మంత్రులు, అటవీశాఖ అధికారులు ఉన్నారు. భూమిపై ఉన్న అపురూపమైన జీవవైవిధ్యాన్ని సంరక్షించడానికి ప్రపంచంలోని ప్రజలంతా కృషి చేయాలని పిలుపు నిచ్చారు. రాబోయేతరాలకు మంచి భవిష్యత్తును ఇవ్వడానికి ప్రకృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. వన్యప్రాణులను సంరక్షించడంలో భారతదేశం చేస్తున్న కృషికి గర్వపడుతున్నట్లు పేర్కొన్నారు. గుజరాత్ పర్యటనలో భాగంగా మోదీ ఆదివారం రిలయన్స్ జామ్‌నగర్ రిఫైనరీ కాంప్లెక్స్‌లోని జంతు సంరక్షణ, పునరావాస కేంద్రం వంతారాను, సోమనాథ్ ఆలయాన్ని సందర్శించారు. అనంతరం సాసన్‌లోని రాష్ట్ర అటవీశాఖ అతిథిగృహమైన సిన్హ్ సదన్‌లో బస చేశారు. సోమవారం తెల్లవారుజామున గిర్ వణ్యప్రాణి సంరక్షణ కేంద్రాన్ని సందర్శించారు. మధ్యాహ్నం గిర్ వన్యప్రాణుల అభయారణ్యం ప్రధాన కార్యాలయమైన ససన్ గిర్‌లో నిర్వహించనున్న నేషనల్ బోర్డ్ ఫర్ వైల్డ్‌లైఫ్ (ఔఃచిఒ) కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించనున్నారు. ఇందులో చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్, వివిధ రాష్ట్రాల సభ్యులు, వన్యప్రాణి సంరక్షణకు కృషి చేస్తున్నట్లు పలు ఎన్జీవోల ప్రతినిధులు పాల్గొనున్నారు. ఈ సమావేశం అనంతరం ప్రధాని ససన్‌లోని అటవీ సిబ్బందితో సంభాషించనున్నట్లు సమాచారం. ఆసియా టిక్ సింహాలను సంరక్షించే లక్ష్యంతో ప్రాజెక్ట్ లయన్ కోసం కేంద్ర ప్రభుత్వం రూ. 2,900 కోట్లకు పైగా నిధులు మంజూరుచేసినట్లు అధికారిక వర్గాలు వెల్లడిస్తున్నాయి. ప్రస్తుతం.. ఆసియాటిక్ సింహాలు గుజరాత్‌లోని గిర్ అడవుల్లో దాదాపు 30,000 చదరపు కిలోమీటర్లలో విస్తరించి ఉన్నాయి.

# గాంధీ ఆశయాలే పట్టని కాంగ్రెస్‌కు.. గాంధీ విగ్రహం ఎలా కనిపిస్తుంది

హైదరాబాద్: కేసీఆర్ ఆనవాళ్లు చెరిపేస్తా, తుడిచేస్తా అనే కురచ బుద్ధితో ఉన్న సీఎం రేవంత్ రెడ్డికి జాతిపిత గాంధీజీ కూడా టార్గెట్ అయినట్టున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. గాంధీ పేరు చెప్పి రాజకీయాలు చేస్తూ పబ్బం గడుపుకోవడమే తప్ప, ఆయన పట్ల, ఆయన సిద్ధాంతాల పట్ల కాంగ్రెస్ పార్టీకి, రేవంత్ రెడ్డికి ఏమాత్రం గౌరవం లేదని మండిపడ్డారు. చెడు వినకు, చెడు చూడకు, చెడు మాట్లాడకు అనేది గాంధీ గారి సిద్ధాంతం అయితే, రేవంత్ రెడ్డిది చెడు విను, చెడు చూడు, చెడు మాట్లాడు అనే సిద్ధామని ధ్వజమెత్తారు. అడ్డగోలుగా అబద్ధాలు ప్రచారం చేయడానికి ఆయన అనుసరిస్తున్న మూల సూత్రం ఇదేనని విమర్శించారు. సికింద్రాబాద్ గాంధీ దవాఖాన ముందు ఉన్న విగ్రహాన్ని చూసుకోవడం చేదకానీ బాపు ఘాట్ పునరుద్ధరిస్తామని బడాయి కొడుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. గాంధీ ఆశయాలే పట్టని కాంగ్రెస్ పార్టీకి, గాంధీ విగ్రహం ఎలా కనిపిస్తుందన్నారు. నాడు ఎంతో ఆడంబరంగా ఆవిష్కరించుకున్న గాంధీ విగ్రహం.. నేడు నిర్వహణ లేక ఈ స్థితిలో ఉండటం బాధకరమని చెప్పారు. ఓ మహాత్మా మన్నించు అంటూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'అక్టోబర్ 2, 2022 గాంధీ జయంతిని పురస్కరించుకొని నాడు సీఎంగా ఉన్న కేసీఆర్ గారు గాంధీ ఆసుపత్రి ముందు ఆవిష్కరించిన గాంధీ గారి కాంస్య విగ్రహం ఇది. కెసిఆర్ ఆనవాళ్లు చెరిపేస్తా, తుడిచేస్తా అనే కురచ బుద్ధితో ఉన్న సిఎం రేవంత్ రెడ్డికి జాతిపిత గాంధీజీ కూడా టార్గెట్ అయినట్టున్నా రు. గాంధీ పేరు చెప్పి రాజకీయాలు చేస్తూ పబ్బం గడుపుకోవడమే తప్ప, ఆయన



పట్ల, ఆయన సిద్ధాంతాల పట్ల కాంగ్రెస్ పార్టీకి, రేవంత్ రెడ్డికి ఏమాత్రం గౌరవం లేదు. చెడు వినకు, చెడు చూడకు, చెడు మాట్లాడకు అనేది గాంధీ గారి సిద్ధాంతం అయితే,రేవంత్ రెడ్డి ది చెడు విను, చెడు చూడు, చెడు మాట్లాడు అనే సిద్ధాంతం. అడ్డగోలుగా అబద్ధాలు ప్రచారం చేయడానికి ఆయన అనుసరిస్తున్న మూల సూత్రం ఇదే.గాంధీ ఆశయాలే పట్టని కాంగ్రెస్ పార్టీకి, గాంధీ విగ్రహం ఎలా కనిపిస్తుంది. ఉన్న గాంధీ విగ్రహాన్ని చూసుకోవడం చేత కాదు, కానీ బాపు ఘాట్ పునరుద్దరిస్తమని బడాయి కొడుతున్నడు. ఆనాడు ఎంతో ఆడంబరంగా ఆవిష్కరించుకున్న గాంధీ విగ్రహం,నేడు నిర్వహణ లేక ఈ స్థితిలో ఉండటం బాధాకరం. ఓ మహాత్మా మన్నించు!' అని హరీశ్ రావు ట్వీట్ చేశారు.

# మహిళలకు ఐదేండ్లలో లక్ష కోట్లు ఇస్తామన్న కాంగ్రెస్ హామీ వట్టిదే

హైదరాబాద్: కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామన్న సీఎం రేవంత్ మాటలు ఉత్తవేనని ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. చిత్తశుద్ధి ఉంటే ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మహిళలకు రూ. 2500 వెంటనే పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఐదేండ్లలో లక్ష కోట్లు ఇస్తామన్న కాంగ్రెస్ హామీ వట్టిదేనని చెప్పారు. మహిళలకు ఇచ్చిన హామీల సాధనకై తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో పోస్టు కార్డు ఉద్యమాన్ని ప్రారంభించారు. జాగృతి మహిళా కార్యాకర్తల నుంచి సేకరించిన 10 వేల పోస్టుల కార్డులను సీఎం రేవంత్ రెడ్డికి పంపించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. హామీల అమలుపై మార్చి 8న ప్రకటన చేయకపోతే 10 వేల మహిళలం 10 వేల గ్రామాల్లోకి వెళ్తామన్నారు. లక్షలాది పోస్టు కార్డులను తయారు చేసి సోనియా గాంధీకి పంపిస్తామని చెప్పారు. మహిళల విషయంలో సీఎం రేవంత్ రెడ్డి మానవీయంగా ఆలోచించడం లేదని విమర్శించారు. ఆడబిడ్డల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి నిర్లక్ష్యం తగదన్నారు. సోనియా గాంధీ, ప్రియాంకా గాంధీ మాట్లాడక ముందే మహిళా బిల్లు కోసం తెలంగాణ జాగృతి ఢిల్లీలో ధర్నా చేసిందని గుర్తుచేశారు. మహిళా బిల్లు రావడంలో కాంగ్రెస్ పార్టీ పాత్ర ఏమీలేదని చెప్పారు. మహిళా రిజర్వేషన్ చట్టాన్ని అమలుకు కాంగ్రెస్ పార్టీ కేంద్రంపై ఎందుకు ఒత్తిడి చేయడం లేదని ప్రశ్నించారు. వరంగల్ విమానాశ్రయానికి రాణి రుద్రమాదేవీ పేరు పెట్టాలడి డిమాండ్ చేశారు. ఈ విషయంలో తాము కూడా కేంద్రానికి లేఖ రాస్తామన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామన్న సీఎం ప్రకటనకు, ఆయన ప్రారంభించిన పెట్రోల్ పంప్‌కు పోలిక లేదని విమర్శించారు. ప్రభుత్వం ప్రతిపాదించిన పథకాలు కేవలం పదుల సంఖ్యలో మహిళలకు తప్పా పెద్ద ఎత్తున ప్రయోజనం కలిగే అవకాశంలేదన్నారు. మహిళలకు నెలకు రూ. 2500 ఇచ్చే కార్యక్రమాన్ని మొదలుపెడితే ఎక్కువ మంది మహిళలకు ప్రయోజనం కలుగుతుందని వెల్లడించారు. 18 ఏండ్లు నిండిన ఆడపిల్లలకు స్కూటీలు పంపిణీ చేస్తామన్న హామీని అమలు చేయాలన్నారు. మార్చి 8న ఈ పథకాలను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. వడ్డీ లేని రుణాలపై ప్రభుత్వం అందంగా అబద్ధాలు చెబుతున్నదని మండిపడ్డారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డీ లేని రుణాలను ఎగ్గొట్టిందని విమర్శించారు. వడ్డీ లేని రుణాల పరిమితిని రూ. 20 లక్షలకు పెంచుతామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, వడ్డీ రాయితీ



బకాయిలు విడుదలతో పాటు రుణ పరిమితిని రూ. 20 లక్షలకు పెంచాలన్నారు. భర్త చనిపోయిన మహిళలకు కొత్తగా పెన్షన్ ఇవ్వడం లేదని చెప్పారు. బీఆర్ఎస్ పాలన ఉన్నప్పుడు వస్తున్న పింఛన్లు మాత్రమే ఇస్తున్నారని చెప్పారు. కొత్తగా పెన్షన్‌దారులను నమోదుచేయడం లేదన్నారు. తక్షణమే పింఛన్ మొత్తాన్ని రూ. 4 వేలకు పెంచడంతోపాటు, అభయ హస్తం నిధులను తక్షణమే విడుదల చేయాలన్నారు. రాష్ట్రంలో మహిళలకు భద్రత కరువైందని విమర్శించారు. నేరాల శాతం 20 శాతం పెరిగాయని డీజీపీ వెల్లడించారు. ఆడబిడ్డలకు రక్షణపై ప్రభుత్వం సమీక్షించి ప్రకటన చేయాలన్నారు. కేసీఆర్ కిట్ పంపిణీని నిలిపివేసి కాంగ్రెస్ పార్టీ మానవత్వాన్ని మంటకలిపిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంనటే కేసీఆర్ కిట్‌ను కొనసాగించాలని చెప్పారు. మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలను పెంచాలన్నారు. మహిళా కార్మికులను ప్రత్యేకంగా గుర్తించి అవసరమైన సదుపాయాలు కల్పించాలని చెప్పారు. మహిళా కార్మికులకు సంబంధించి ప్రత్యేక కార్యాచరణను ప్రకటించాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ కార్మికుల జీతాలను పెంచుతామని హామీ ఇచ్చిన విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం..వెంటనే అంగన్‌వాడీ పోస్టులను భర్తీ చేస్తున్నట్లు ప్రభుత్వం ఢాంబికాలు పలుకుతున్నదని విమర్శించారు. కేసీఆర్ హయాంలోనే ఆ పోస్టులను సృష్టించారని గుర్తుచేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ఆడపిల్లలకు ఫీజు రియింబర్స్‌మెంట్ చేయడం లేదని, దీంతో తల్లిదండ్రులు వారిని చదువు మానిపిస్తున్నారని తెలిపారు.

# ఈ డ్యామేజ్ డైవర్షన్ కుట్రలు తెలంగాణ గడ్డపై ఎప్పటికీ సాగవు



హైదరాబాద్: శ్రీశైలం ఎడమగట్టు కాలువ సొరంగం ప్రమాదానికి కారణం కేసీఆర్ అంటూ సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైరయ్యారు. ఎస్ఎల్‌బీసీలో సెంటీమీటర్ సొరంగం తవ్వడం కూడా చేతకాని సీఎం, 12 కిలోమీటర్ల టన్నెల్ పూర్తిచేసిన బీఆర్ఎస్‌పై నిందలు వేయడం సిగ్గుచేటన్నారు. గత 13 నెలలుగా ప్రాజెక్టు పనులను పూర్తిగా పండబెట్టి, తన వైఫల్యాన్ని గత ప్రభుత్వంపైకి నెట్టాలనే నీచానికి దిగడం అత్యంత దుర్మార్గమని మండిపడ్డారు. కనీస ప్రణాళిక లేకుండా పనులు మొదలుపెట్టి, నాలుగు రోజులు కాకముందే ఎనిమిది మంది అమాయకుల నిండు ప్రాణాలను ఫణంగా పెట్టిన పాపం ముఖ్యమంత్రిదేనని చెప్పారు. మొత్తం సొరంగం 43.94 కిలోమీటర్లయితే, 2005-2014 వరకున్న గత కాంగ్రెస్ సర్కారు హయాంలో తవ్వింది కేవలం 22.89 కిలోమీటర్లే అన్నారు. సొరంగంలో క్లిష్టమైన పరిస్థితులున్నా, ఏ ప్రమాదం జరగకుండా ఏకంగా 12 కిలోమీటర్ల మేర టన్నెల్ పనులు పూర్తి చేసిన చరిత్ర బీఆర్ఎస్ ప్రభుత్వానిదని తెలిపారు. నాటి కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎస్ఎల్‌బీసీ పనులకు రూ. 3300 కోట్ల ఖర్చుచేస్తే, బీఆర్ఎస్ పాలనలో రూ. 3900 కోట్ల పనులు పూర్తిచేసిన వాస్తవాన్ని దాచే ప్రయత్నంలో ముఖ్యమంత్రి బొక్కబోర్లా పడ్డారని ఎద్దేవాచేశారు. గత కాంగ్రెస్ సర్కారుకన్నా రూ. 600 కోట్లు ఎక్కువ ఖర్చుచేసిన బీఆర్ఎస్ ప్రభుత్వంపై బురదజల్లడం ఈ ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనమని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మూడున్నరేండ్లలోనే 203 కిలోమీటర్ల టన్నెళ్లు తవ్వినా, ఎస్ఎల్‌బీసీ వంటి దారుణ సంఘటన జరిగిన దాఖలా లేవని వెల్లడించారు. రైతులకు నీళ్లిచ్చే ప్రాజెక్టులు కాకుండా.. గల్లీ నుంచి ఢిల్లీదాకా కమీషన్లిచ్చే ప్రాజెక్టులు చేపట్టి వాటిని అర్ధాంతరంగా గాలికి వదిలేసే నీచ చరిత్ర కాంగ్రెస్ పార్టీదేనని విమర్శించారు. చేసిన తప్పును ఒప్పుకోవడం తప్ప ముఖ్యమంత్రి ముందు మరో మార్గం లేదని చెప్పారు. ఈ డ్యామేజ్ డైవర్షన్ కుట్రలు చైతన్యవంతమైన తెలంగాణ గడ్డపై ఎప్పటికీ సాగవని ఎక్స్ వేదికగా స్పష్టం చేశారు.

# మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్,పజంట్ అని ఇండస్ట్రీలతో పోలిస్తే మన భారతీయ చిత్ర పరిశ్రమ నెంబర్ వన్ పొజిషన్ లో ఉంది. వరుస పాన్ ఇండియా చిత్రాలతో బ్లాక్ బస్టర్ హిట్‌లు అందుకుంటా.. వసుల పరంగా దూసుకుపోతున్నాయి. అయితే ఇటీవల అలనాటి నటి, నిర్మాత కృష్ణవేణి మృతి చెందిన విషయం తెలిసిందే. రీసెంట్‌గా కృష్ణవేణి సంస్మరణ సభ ఆదివారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన బీజేపీ సీనియర్ మోస్ట్ నేత, మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు భారతీయ చలన చిత్రాల్లో హీరోల పాత్రల తీరుపై సంచలన వ్యాఖ్యలు చేశారు. సినిమాల ద్వారా ప్రజలకు మంచి సందేశం వెళ్లడం లేదు. దేశ ద్రోహులు, స్మగ్లర్లు, సమాజంలో తప్పుడు విధానాలు పాటించే వారి పాత్రలో హీరోలు రూపకల్పన చేస్తున్నారు. ఇది ఎంతమాత్రం మంచి పద్ధతి కాదు. ఈ మూవీస్ ద్వారా సమాజానికి ఎలాంటి సందేశం వెళుతుందన్న విషయంపై దర్శకులు ఓసారి ఆలోచన చేయాలి. చెడు పనులను ఎప్పుడూ గొప్పగా చూపించకూడదు. చిత్ర పరిశ్రమలో ఎప్పుడూ బాధ్యతాయుతంగా ఉండాలి. హీరోల పాత్రల ప్రభావం చిన్న పిల్లలపై అధికంగా పడుతుంది. ఈ సున్నితమైన



ఈ విషయాలపై సినీ పరిశ్రమలో ఒక సారి ఆలోచిస్తే బాగుంటుంది' అని వెంకయ్య అభిప్రాయపడ్డారు. మరి ఏ సినిమాను ఉద్దేశించి ఈ మాటలు అన్నాడో తెలియదు కానీ, ప్రజంట్ వెంకయ్య వ్యాక్యలు సోషల్ మీడియాలో సంచలనం రేపుతున్నాయి.

# ఆలస్యం చేయకండి.. అత్యవసరంగా పిల్లల్ని కనండి



తమిళనాడు:తమిళనాడు ప్రజలకు సీఎం ఎంకే స్టాలిన్ కీలక విజ్ఞప్తి చేశారు. తమిళనాడు ప్రజలు అత్యవసరంగా పిల్లల్ని కనాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో విజయవంతంగా అమలు చేస్తున్న కుటుంబ నియంత్రణ చర్యలు ఇప్పుడు ప్రతికూల స్థితిలో ఉంచాయని వ్యాఖ్యానించారు.

నియోజకవర్గాల పునర్విభజన జరిగితే తమిళనాడు రాష్ట్రం 8 ఎంపీ స్థానాలను కోల్పోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ప్రజలు ఆలస్యం చేయకుండా తన విజ్ఞప్తి మేరకు వెంటనే పిల్లల్నికనా లని పిలుపునిచ్చారు. కాగా, గతంలోనూ స్టాలిన్ ఇలాంటి విజ్ఞప్తే చేశారు. రాష్ట్ర ప్రజలు ఎక్కువ మంది పిల్లల్ని కనాలని పిలుపునిచ్చారు. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా 16 రకాల సంపదలకు బదులుగా 16 మంది పిల్లలను కనాల్సిన సమయం వచ్చిందని వ్యాఖ్యానించారు. పరిమితంగా పిల్లలను కని సంపదతో జీవించాలనే ఉద్దేశంతో కుటుంబ నియంత్రణ ప్రచారాన్ని చేపట్టామన్నారు. దీని కారణంగా రానున్న కాలంలో నియోజకవర్గాల పునర్విభజన జరిగినప్పుడు లోక్‌సభ స్థానాలు తగ్గే పరిస్థితి ఏర్పడిందన్నారు.

**డీలిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం**

దక్షిణాది రాష్ట్రాల్లో డీలిమిటేషన్ సెగ రాజుకుంటున్నది. వచ్చే పార్లమెంట్? ఎన్నికల నాటికి లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన చేయాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ముందుకెళ్తోంది. జనాభా ప్రాతిపదికన లోక్‌సభ నియోజకవర్గాలను పునర్విభజించాలని కేంద్రం భావిస్తోంది. కేంద్రం అనుసరించబోతున్న ఈ విధానంపై దక్షిణాది రాష్ట్రాల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. అదే జరిగితే దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, ఉత్తరాది రాష్ట్రాలు మాత్రం భారీగా లాభపడతాయని ఐదు రాష్ట్రాల సీఎంలు, రాజకీయ పార్టీల నేతలు మండిపడుతున్నారు.

**జనాభా ఆధారంగా డీలిమిటేషన్ వద్దు..**

కేవలం జనాభా ఆధారంగా దక్షిణాది రాష్ట్రాల పార్లమెంట్ సీట్లను నిర్ణయించరాదు అని కేంద్రాన్ని తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ ఇటీవలే కోరారు. ఒకవేళ అలాంటి ప్రయత్నం ఏదైనా జరిగితే, దాన్ని ప్రతిఘటిస్తామని హెచ్చరించారు. పార్లమెంటరీ నియోజకవర్గాల డీలిమిటేషన్ ప్రక్రియ ద్వారా తమ రాష్ట్రానికి ఎటువంటి అన్యాయం జరిగినా సహించేది లేదన్నారు. మా డిమాండ్ చాలా స్పష్టంగా ఉందని, కేవలం జనాభా ఆధారంగా పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన జరగవద్దు అని, జనాభా నియంత్రణకు దక్షిణాది రాష్ట్రాలు తీవ్ర చర్యలు తీసుకున్నాయని గుర్తు చేశారు. ఇప్పుడు డీలిమిటేషన్ ద్వారా ఆ రాష్ట్రాలను శిక్షించవద్దు అని కేంద్రానికి స్టాలిన్ విజ్ఞప్తి చేశారు.

**ఎక్కువమంది పిల్లల్ని కనండి.. ఏపీ సీఎం**

ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడు కూడా ఇటీవలే ఇలాంటి వ్యాఖ్యలు చేశారు. జనాభా సమతుల్యతపై వృద్ధాప్య జనాభా ప్రభావంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కుటుంబాలు ఎక్కువ మంది పిల్లలను కలిగి ఉండాలని చంద్రబాబు కోరారు. ఇద్దరు లేదా అంత కంటే ఎక్కువ మంది పిల్లలు ఉన్న వ్యక్తులు మాత్రమే స్థానిక సంస్థల ఎన్నికలలో పోటీ చేయడానికి అనుమతించే చట్టాన్ని తెచ్చేందుకు తమ ప్రభుత్వం ప్లాన్ చేస్తున్నదని వెల్లడించారు.

# రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది



అమరావతి,మార్చి3: కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉందని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే 40 వేల 336 వ్యవసాయ కనెక్షన్‌లు మంజూరు చేశామన్నారు. ఒక్కో వ్యవసాయ కనెక్షన్‌కు 2 లక్షల 60 వేలు, ఉచిత విద్యుత్‌కు 12 వేల 400 కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. గతంలో వేర్వేరు రేట్లకు ట్రాన్స్‌ఫార్మర్లు కొనుగోలు చేశారని, ఇక అలా లేకుండా చూస్తామని మంత్రి గొట్టిపాటి చెప్పారు. ఏపీ బడ్జెట్ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ప్రశ్నోత్తరాల నేపథ్యంలో మంత్రి గొట్టిపాటి పలువురు సభ్యల ప్రశ్నలపై మాట్లాడారు. ఈ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే 40 వేల 336 వ్యవసాయ కనెక్షన్‌లు మంజూరు చేశాం. 22 వేల 709 కనెక్షన్‌లు రైతులకు ఇచ్చి వినియోగంలోకి తెచ్చాము. 69 వేల 70 కనెక్షన్‌లు పెండింగ్లో ఉంటే మరో 20 వేలు మంజూరుకు అనుమతి ఇచ్చాము. పగటిపూట వ్యవసాయానికి విద్యుత్ ఇవ్వాలని కోరుతున్నారు. కేంద్రం ఇచ్చిన పీఎం కుసుమ్ అనే కార్యక్రమాన్ని ఈ రాష్ట్రప్రభుత్వం చేపడుతుంది అనగానే.. నాలుగున్నర లక్షలు కనెక్షన్‌లకు అవకాశం ఇచ్చారు. ఒక్కో వ్యవసాయ కనెక్షన్‌కు 2 లక్షల 60 వేలు ఖర్చు చేస్తున్నాం. ఉచిత విద్యుత్‌కు 12 వేల 400 కోట్లు ఖర్చు చేస్తున్నాం. పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాలో ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనాలు జరిగితే వెంటనే పిర్యాదు చేసి వివరాలు ఇస్తే తప్పనిసరిగా కొత్తవి ఇస్తాం. అసైన్డ్ ల్యాండ్లకు దొంగ కనెక్షన్‌లు ఇస్తున్నారు, వాటిని రద్దు చేస్తాం. ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనాలు జరగకుండా అల్యూమినియంతో వైరింగ్ చేయిస్తున్నాం. డిస్కంలకు మధ్య రేట్లలో అతరం లేకుండా చూస్తాం.. గతంలో వేర్వేరు రేట్లకు ట్రాన్స్‌ఫార్మర్లను కొనుగోలు చేశారు, ఇక అలా లేకుండా చూస్తాం అని మంత్రి గొట్టిపాటి చెప్పారు.

# ఔను.. వారంతా ఏకమయ్యారు.. ఇదే చంద్రబాబు ఆవేదన!



విజయవాడ:నాయకులంతా ఏకమైతే.. పార్టీ అధినేతకు బాధ ఎందుకు ఉంటుంది? ఆ పరిస్థితి గురించి.. ఆయన ఎందుకు తెగ ఆవేదన వ్యక్తం చేస్తారు? ఇదే విషయం.. రాజకీయంగా ఏపీలో చర్చనీయాంశం అయింది. తాజాగా సీఎం చంద్రబాబు పార్టీనాయకులకు, సీనియర్లకు కూడా హెచ్చరికలు చేశారు. మీలో మీరు కలిసిపోతే.. ఒకరికొకరు సహకరించుకుంటే.. అది పార్టీని తీరని నష్టం.. పైగా రాష్ట్రానికి కూడా నష్టంఅని హెచ్చరించారు. దీంతో రాష్ట్రంలో తమ్ముళ్ల పరిస్థితిపై చర్చ సాగుతోంది.వాస్తవానికి చంద్రబాబు చేసిన సూచన, హెచ్చరికలు.. కేవలం తెలుగు దేశం పార్టీ నాయకుల గురించే కాదు.. వారు.. మిలాఖత్ అవుతున్న వైసీపీ నాయకులను కూడా ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

చాలా జిల్లా ల్లో వైసీపీ నేతలతో టీడీపీ నాయకులు మిలాఖత్ అయ్యారన్నది వాస్తవం. ఈ వ్యవహారంపై కొన్నాళ్లుగా విమర్శలు వినిపిస్తూనే ఉన్నాయి. ఇసుక, మద్యం సహా.. ఇతర వ్యాపాల్లోనూ.. ఇరు పక్షాలు కలిసిడిగా ముందుకు సాగుతున్నాయి. దీంతో కొన్ని కేసులు తేలిపోతున్నాయి.గతంలో వైసీపీ హయాంలో జరిగిన అక్రమాలపై నిగ్గు తేల్చాలని అనుకున్నా.. ఇప్పుడు కొన్ని జిల్లాల్లో ఆ పరిస్థితి ముందుకు సాగడం లేదు. దీనికి కారణం.. మిలాఖత్తేనని చంద్రబాబుకు సమాచారం ఉంది. మీది తెనాలే.. మాది తెనాలే అన్నట్టుగా.. నాయకులు కేసులు విషయంలోనూ సహకరించుకుంటు న్నారు. ఇటీవల కర్నూలు, నెల్లూరు, అనంతపురంలోనూ ఈ తరహా ఘటనలు వెలుగు చూశాయి.వైసీపీ నాయకులతో కలిసి వ్యాపారాలు చేస్తున్న కొందరు టీడీపీ నాయకులు వారికి అన్నివిధాలా సహకరిస్తు న్నారు.ఈ విషయాన్నే సీఎం చంద్రబాబు హెచ్చరించారు. తాను వైసీపీ నాయకులు చేసిన అరాచకాలపై పోరాటం చేస్తూ.. ప్రజల ఆకాంక్షల మేరకు చర్యలు తీసుకుంటుంటే.. మీరు వారితో చేతులు కలిపి.. పార్టీకి.. ప్రభుత్వానికి కూడా చెడ్డపేరు తీసుకువస్తున్నా రన్నది బాబు ఆవేదన. ఈ నేపథ్యంలో ఇలాంటి వారికి సాయం చేయరాదని చెబుతున్నారు. కానీ.. ప్రభుత్వం ఏదైనా.. టీడీపీ-వైసీపీ నేతల మధ్య కొన్ని కొన్ని జిల్లాల్లో ఇప్పుడే కాదు.. గతంలోనూ అవగాహనా ఒప్పందాలు ఉన్నాయి. దీంతో ఒకరికొకరు సహకరించుకోవడం అనేది కామన్ అయింది. కానీ, ఇప్పుడు చంద్రబాబు వద్దంటున్నారు. మరి తమ్ముళ్లు ఏం చేస్తారో చూడాలి.

# జగన్ పవన్ ఈ సమ్మర్ ని హీటెక్కిస్తారా ?

అమరావతి,ఏపీలో రాజకీయం అంటేనే టాప్ రేపే హీట్ తో సాగుతుంది. పైగా పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ కూడా ఉన్నారు. అలాగే రాజకీయంగా కాకలు తీరిన చంద్రబాబు ఇంకో వైపు ఉంటే దూకుడునే సర్వ కాలాలలోనూ నమ్ముకున్న జగన్ మరో వైపు ఉంటారు. దాంతో ఏపీ రాజకీయాల్లో హీట్ ఎపుడూ ఉ ంటుంది. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఏపీలో పాలిటిక్స్ వాడిగా వేడిగా సాగుతుంది.అధికారాలు అటూ ఇటూ మారుతాయి. వారు వీరు అవుతారు కానీ పాలిటిక్స్ మాత్రం అలాగే ఉంటుంది. సేం టూ సేం అన్నట్లుగానే సాగుతూ వస్తోంది. ఏపీలో చూస్తే 2024 ఎన్నికల వేళ ఎంతటి పొలిటికల్ వార్ నడిచిందో అంతా చూశారు. సరిగ్గా సమ్మర్ లో వచ్చిన సార్వత్రిక ఎన్నికలు కురుక్షేత్ర యుద్ధాన్ని తలపించాయి.హోరా హోరీగా పోటీగా మాటల తూటాలను పేల్చారు. విజయమో వీర స్వర్గమో అన్నట్లుగా అటూ ఇటూ మోహరించి పోరాడారు. మొత్తానికి ఎన్నికలు ముగిసి ఫలితం ఏకపక్షంగా టీడీపీ కూటమిని వరించింది. అది లగాయితూ వైసీపీ గత తొమ్మిది నెలలుగా పెద్దగా సందడి అయితే చేయడంలేదు అధినేత కూడా జనంలోకి రావడానికి చూస్తున్నారు కానీ సరైన ముహూర్తాలు ఫిక్స్ కావడం లేదు.జగన్ జిల్లా టూర్లు చూస్తే మొదట డిసెంబర్ లో అన్నారు. ఆ తరువాత సంక్రాంతి పండుగ అన్నారు. మహా శివరాత్రి తరువాత నుంచి అన్నారు. ఇపుడు కొత్తగా ఉగాది తరువాత నుంచి అంటున్నారు. ఇదే ఖాయమని చెబుతున్నారు. అంటే మార్చి 30న ఉగాది పండుగ ఉంటే ఏప్రిల్ నెల నుంచి జగన్ జిల్లాల టూర్లు స్టార్ట్ అవుతాయని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.అప్పటికి పది నెలల టీడీపీ కూటమి పాలన పూర్తి అవుతుంది కాబట్టి వైసీపీ అధినేత జనంలోకి వెళ్తే మంచి మైలేజ్ వస్తుందని పైగా పొలిటికల్ గా కూటమి మీద వార్ ప్రకటించేందుకు అది సరైన సందర్భం అని వైసీపీ వ్యూహకర్తలు భావిస్తున్నారుట.సో జగన్ ఏప్రిల్ నుంచి జనంలోకి వస్తారు అన్నది ఒక ప్రచారంగా ఉంది. అదే సమయంలో జనసేన అధినేత ఉ



ప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కూడా ప్లీనరీ తరువాత జిల్లాల టూర్లకు రెడీ అవుతున్నారు అని ఇప్పటికే ప్రచారంలో ఉంది. పార్టీ బలోపేతమే లక్ష్యంగా పవన్ టూర్ సాగుతుందని అలాగే ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయడం వారితో నేరుగా కనెక్ట్ కావడం కూడా చేస్తారు అని అంటున్నారు.ఇక పవన్ చూస్తే జగన్ కి వైసీపీకి హార్డ్ కోర్ రీజియన్ అయిన రాయలసీమ నుంచే తన జిల్లాల టూర్లు స్టార్ట్ చేస్తారు అని అంటున్నారు. అదే సమయంలో జగన్ చూస్తే జనసేన టీడీపీలకు కంచుకోటగా మారిన ఉత్తరాంధ్రా జిల్లాల నుంచి తన టూర్ మొదలెడతారని అంటున్నారు.జగన్ శ్రీకాకుళం నుంచే తన జిల్లా పర్యటనలకు శ్రీకారం చుడతారని ప్రచారంలో ఉంటే పవన్ అనంతపురం నుంచి జిల్లాల పర్యటనకు రంగం సిద్ధం చేస్తున్నారని ప్రచారం సాగుతోంది. ఈ ఉద్దరు నేతలూ ఒకేసారి జిల్లాల టూర్లు చేపడితే ఈసారి సమ్మర్ ఒక్కలా ఉ ండదని అంటున్నారు. అసలే ఈ సమ్మర్ సీజన్ బాగా వేడిగా ఉంటుందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. దాంతో ఈ పొలిటికల్ హీట్ కూడా మామూలుగా ఉండదని అంటున్నారు.

# పదేళ్లయినా కొలిక్కిరాని పంచాయితీ...

శ్రీశైలం, శ్రీశైలం, సాగర్ రిజర్వాయర్లపై పట్టు కోసం రెండు తెలుగు రాష్ట్రాల మధ్య వివాదం కొలిక్కి వచ్చేలా లేదు. ఇప్పటికీ రెండు రాష్ట్రాలు కలబడుతూనే ఉన్నాయి. 2023 డిసెంబర్ మొదటి వారంలో సాగర్ డ్యామ్‌పై ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. దీంతో ఇరు రాష్ట్రాల పోలీసుల మధ్య ఇరిగేషన్ అధికారులు బాహాబాహీని తిలకించారు. నీళ్ల వాటా విషయంలో కేసీఆర్, చంద్రబాబు, జగన్, ఇప్పుడు రేవంత్.. కృష్ణా జలాల వివాదాన్ని జఠిలం చేస్తూనే ఉన్నారు. ఎన్నికలొచ్చిన ప్రతీసారీ ఇదొక ప్రచారాస్త్రంగా కూడా మారుతోంది. నదీ జలాల వివాదాలు.. ఏ రాష్ట్రానికీ కొత్త కాదు. ఏ నదికీ లేనివీ కావు. కావేరీ, నర్మద, మహానది, పెరియార్, మహాదాయి ఇలా వివాదాల్లో చిక్కుకున్న నదుల జాబితా చాంతాడంత. ఆ జాబితాలో తెలుగు రాష్ట్రాల నీటివాటాల గొడవ చాలా ప్రత్యేకం. రెండు రాష్ట్రాలకూ జీవనాధారమైన కృష్ణ, గోదావరి జలాల వివాదం కేంద్ర జల శక్తి మంత్రిత్వ శాఖకు పెద్ద సమస్యలా మారింది. పాక్, భారత్ కన్నా తీవ్రంగా చూడడం సరికాదు. మహారాష్ట్రలో పుట్టి తూర్పు దిశగా పయనించి కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మీదుగా ప్రవహించి బంగాళాఖాతంలో కలిసే కృష్ణానది.. నాలుగు రాష్ట్రాల నీటి అవసరాలకు ఆసరానిస్తోంది. ఆ మేరకు వివాదాలకూ తావిచ్చింది. 70 ఏళ్లకిందట 2060 టీఎంసీలున్న కృష్ణా జలాల పంపకం దగ్గర నాలుగు రాష్ట్రాల మధ్య వివాదం ముదిరింది. పరిష్కారం కోసం రెండుసార్లు ట్రిబ్యునళ్లను ఏర్పాటు చేసింది కేంద్ర ప్రభుత్వం. ట్రిబ్యునళ్లను దాటి సుప్రీంకోర్టు దాకా వెళ్లింది కృష్ణా జలాల వివాదం. రాయలసీమ ఎత్తిపోతలకు తెలంగాణ ససేమిరా అంటే.. పాలమూరు, దిండి ప్రాజెక్టుల మీద ఏపీ సర్కార్ చెయ్యడ్డం పెట్టడంతో.. గతంలో కూడా కేఆర్ఎంబీ సమావేశాల్లో వాడీవేడి చర్చలు సాగాయి. నీటివాటాలపై జగన్, కేసీఆర్ ప్రభుత్వాధినేతలుగా ఉన్నప్పుడూ రాజీ కుదిరింది లేదు. ఒక శాశ్వత పరిష్కారం వారు చూపలేక పోయారు. చంద్రబాబు, రేవంత్ సన్నిహితులే అయినా సమస్య పరిష్కారం కావడం లేదు. అంటే ఎవరి పట్టువారిదే. ఇక్కడ ప్రజలకన్నా, రాజకీయాలే పైచేయి సాధించాయి. 2021లో కూడా కృష్ణా జలాల పంపకాలపై రెండు రాష్ట్రాల మధ్య లేఖల యుద్ధం జరిగింది. కృష్ణా జలాలను చెరి సగం పంచాలని తెలంగాణ, రెండో ట్రైబ్యునల్ ఆదేశాల మేరకే పంపకాలు జరగాలని ఏపీ.. గట్టిగా వాదించాయి. ఉమ్మడి ప్రాజెక్టుల్లో కూడా నీటి వాటాలు ప్రాజెక్టుల వారీగా జరగలేదని కేఆర్ఎంబీ దృష్టికి ఏపీ సర్కార్ తీసుకెళ్లింది. శ్రీశైలం నుంచి చెన్నైకు, సాగర్ నుంచి హైదరాబాద్‌కు తాగునీటి కోసం మాత్రమే నీళ్లను తీసుకునేందుకు వెసులుబాటు ఉందని, మిగతాదంతా పాత పద్ధతిలోనే కొనసాగించాలని కోరింది. నాలుగేళ్లు గడిచినా.. తెలంగాణ కోరుతున్న ఫిఫ్టీ-ఫిఫ్టీ డిమాండ్ ముందుకు జరగడం లేదు. ఇదే విషయంలో పదేళ్లు నాన్చిన బిఆర్ఎస్ నేతలు నీతులు వల్లిస్తున్నారు. వాటం తీరు మాట్లాడుతున్నారు. సిగ్గుఎగ్గూ లేకుండా పంచాయితీలో ఆజ్యం పోస్తున్నారు. నీటి వాటాల సమస్య పరిష్కారం కోసం ముందుగా చిత్తశుద్ధితో ఉండాలి. కెఆర్ఎంబి ముందు సామరస్యంగా మాట్లాడుకోవాలి. గత ఏడాది ఏప్రిల్‌లో హైదరాబాద్ జలసౌధలో త్రిసభ్య కమిటీ సమావేశం జరిగింది. కానీ.. రెండు తెలుగు రాష్ట్రాల అధికారులు డుమ్మా కొట్టారు. కెఆర్ఎంబి ఉనికినే ప్రశ్నిస్తున్న తెలంగాణ వాదన వివాదాస్పదంగా



మారుతోంది. కెఆర్ఎంబి లేకుంటే ఏపీ, తెలంగాణ మధ్య సమన్వయం ఎలా అని కేంద్ర జలశక్తి శాఖ ప్రశ్నిస్తోంది. విభజన చట్టంలో కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డును ప్రతిపాదించిందే అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం. ఇప్పుడు ఆ కాంగ్రెస్ పార్టీ నుంచే వ్యతిరేకత రావడం ఏంటన్నది ఆలోచించాలి..ఏపీ, తెలంగాణ పరస్పరం మాట్లాడుకొని.. పట్టువిడుపులకు పోతే తప్ప ఈ గొడవ సద్దుమణిగేది కాదన్నది నిజం.ప్రాజెక్టుల వారీగా రెండు రాష్ట్రాలకూ నీటి కేటాయింపులు జరగాలని, నీటి విడుదలకూ ప్రొటోకాల్స్ సిద్ధం చేయాలని, రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు సభ్యులుగా కేంద్ర జల వనరుల శాఖ మంత్రి ఛైర్మన్‌గా ఒక ఎపెక్స్ కమిటీని వేయాలని విభజన చట్టం ప్రతిపాదించింది. అప్పటి కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ ఛైర్మన్‌గా ఏర్పాటైన అపెక్స్ కమిటీ అపెక్స్ కమిటీ తొలి సమావేశం 2016లో జరిగింది. నాలుగేళ్ల తర్వాత రెండోసారి సమావేశమైంది. 2015 జూన్‌లో జరిగిన ఒప్పందం ప్రకారమే నీటి పంపకాలు జరగాలి.. దీన్ని కృష్ణా బోర్డు అమలుచేయాలి.. అని గట్టిగా చెప్పారు జగన్. ఇటు.. తెలంగాణ వైఖరి కూడా అంతే కఠినంగా ఉంది. రాయలసీమ ఎత్తిపోతల, పోతిరెడ్డిపాడు ప్రాజెక్టుల్ని వెంటనే నిలిపెయ్యాలన్నది అప్పట్లో కేసీఆర్ పెట్టిన ప్రధాన డిమాండ్. నాగార్జున సాగర్, శ్రీశైలం ప్రాజెక్టు నిర్వహణ బాధ్యతను తమకే అప్పగించా లన్నది మరో మెలిక. కృష్ణా బోర్డు ఏపీకి మద్దతుగా, తెలంగాణకు వ్యతిరేకంగా పనిచేస్తోందని ఆరోపించడం ద్వారా.. అప్పట్లోనే కేసీఆర్ మండిపడ్డారు. ఇలా.. నీటి వాటాలపై నాలుగేళ్ల కిందట పడ్డ పీటముడి ఇప్పటికీ విడిపోలేదు. రెండు రాష్ట్రాల్లో ప్రభుత్వాలు మారి.. కొత్త ముఖ్యమంత్రులు వచ్చినా.. కృష్ణానదీ జలాల విషయంలో రాజీ కుదరలేదు. ఇరిగేషన్ మంత్రి ఉ త్తమ్ కోరిక మేరకు.. కేఆర్ఎంబీ ప్రత్యేకంగా సమావేశమైనా.. పరిష్కారం దిశగా అడుగులు పడలేదు.నీటివాటాలు తేలకుండా కేఆర్ఎంబీకి ప్రాజెక్టుల అప్పగింత జరిగిందని, ఒక్క సంవత్సరం కోసం చేసుకున్న ఒప్పందాన్ని పదేళ్ల తర్వాత కూడా కాంగ్రెస్ కొనసాగించిందని.. దీంతో సమస్య మరింత క్లిష్టమైందని బీఆర్ఎస్ వాదిస్తోంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సహకారం లేకపోతే కృష్ణానది నీటివాటాలు తేలడం అసాధ్యమని తేలిపోయింది. కానీ.. నీళ్లను పరిమితికి మించి వాడుకుంటోందని, కేంద్రప్రభుత్వాన్ని మేనేజ్ చేస్తూ కేఆర్ఎంబీని తమకు అనువుగా మలుచుకుంటోందని తెలంగాణ వైపు నుంచి తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

# వెగటు పుట్టిస్తున్న బిఆర్ఎస్ నేతల విమర్శలు



హైదరాబాద్,నోరుంది కదా అని ఏదిపడితే అది మాట్లాడరాదు. అయితే తమకు నోరుంది కదా అని కాంగ్రెస్‌ను తిట్టడమే పనిగా పెట్టుకున్న బిఆర్ఎస్ నేతలు ఇష్టానుసారంగా మాట్లాడుతున్న తీరు దారుణం కాక మరోటికాదు. నోరు పెద్దది చేయడం ద్వారా పదేళ్ల పాపాలను కప్పిపుచ్చుకోవాలని చూస్తోంది. తప్పుచేసిన వాళ్లే గట్టిగా అరిచేస్తారు. ఇంతకాలం తమదే అధికారం అనుకున్నారు. జీవితాంతం తామే అధికారంలో ఉంటామని అనుకున్నారు. తండ్రి తరవాత తనయుడే సిఎం అవుతాడని భావించారు. గడీల రాజ్యం నెలకొల్పి దానిని కొనసాగిద్దామనుకున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజల దెబ్బతో ..ఓటమిని తట్టుకోలేక పోతున్నారు. అందుకే ఏదిపడితే అది మాట్లాడుతున్నారు. తెలంగాణను అప్పులకుప్ప చేసి, దోపిడీకి తెరలేపి, సర్వనాశనం చేసిన వారే ఇవాళ..నోరు పెద్దది చేస్తున్నారు. అప్పులపై ప్రశ్నలకు సమాధానం లేదు. కాళేశ్వరం అవినీతిపైనా సమాధానం లేదు. ధరణి అక్రమాలపై నోరు మెదపరు. ప్రభుత్వ భూముల మాయంపైనా జవాబు చెప్పారు. నాటి ఎమ్మెల్యేలు, మంత్రుల భూ దందాలపైనా నోరువిప్పరు. ఎమ్మెల్యేలను అప్పనంగా పార్టీలో చేర్చుకున్న వారు ఇప్పుడు జరిగింది మాత్రం తప్పంటారు. ఎల్ఎస్‌బిసి సొరంగంలో ప్రమాదం జరిగి 8మంది కూరుకుపోతే ప్రభుత్వానిది తప్పట. ఇంతకన్నా దారుణమైన విమర్శ మరోటి ఉండదు. అలా అయితే కొండట్టు ప్రమాదానికి, మాసాయిపేట స్కూలు బస్సు ప్రమాదానికి కెటిఆర్, హరీష్ రావులు బాధ్యత వహించాలి. ఇదంతా ఎందుకంటే ఎక్కడ తమ పునాదులు కదులుతాయోనన్న భయం వారిని వెన్నాడుతోంది. అందుకే ప్రతి చిన్నాచితకా విషయాలపై ఎదురుదాడి దిగుతున్నారు. అక్రమాలపై నిలదీస్తుంటే...వాటికి సమాధానాలు పక్కన పెట్టి జీతాలు ఇవ్వడం లేదంటారు. సకాలంలో నీళ్లు రావడం లేదంటారు. అప్పుడే కరెంట్ పోయిందని అంటారు. ఆరు గ్యారెంటీలు ఎలా అమలు చేస్తారని అంటారు. అందుకే ఓ క్రమపద్ధతిలో గత ఏడాదిగా ఎదురుదాడితో బిఆర్ఎస్ ముఖ్యులు ముందుకు సాగుతున్నారు. లోక్‌సభ ఎన్నికలు ముందు ఇలాగే అరచి గీపెట్టినా ప్రజలు ఒక్కటంటే ఒక్కసీటు గెలిపించలేదు. అందుకే ఎమ్మెల్యేను కొనుగోలు చేసారని గీపెడుతున్నారు. సుప్రీం కోటులో దావా వేశారు. ఉప ఎన్నికలు తప్పవని ఊదరగొడుతున్నారు. తెలంగాణలో బిఆర్ఎస్ ఉనికి కోల్పోవడం ఖాయమని ప్రచారం సాగుతోంది. కాంగ్రెస్, బిజెపిలకన్నా ఆ పార్టీ ఎక్కువగా ఒత్తిడికి గురవుతోంది. అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన మూడు నెలల్లో మళ్లీ పార్లమెంట్ ఎన్నికలు ఎదుర్కోవాల్సి రావడం..అవినీతి, అక్రామల పాపాలు వెన్నాడడంతో పాటు, ప్రజల్లో ప్రాభవం కోల్పోవడంతో తట్టుకోలేకపోతున్నారు. అధికారంలో ఉండగా ప్రజలను ఎందుకు కలవాలన్న వారే ఇప్పుడు నా ప్రజలు అంటూ బయలుదేరారు. ఓ వైపు అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి.. మరో వైపు ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీకి సిద్ధంగా లేని పార్టీ నేతలు తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు నానా తంటాలు పడుతున్నారు. కాంగ్రెస్ చేసే తప్పులను ఓ రకంగా వీరుకప్పిపుచ్చుతున్నారనే చెప్పాలి. ఈ సమయంలో బలంగా ప్రజల్లోకి వెళ్లడానికి ఓ అజెండా కూడా కరవైంది. దీనికితోడు కాళేశ్వరం పాపాలను నిత్యం ప్రశ్నిస్తున్నారు. మేకపోతు గాంభీర్యం ప్రదర్శించకుంటే బాగుండదని అనుకున్నారో ఏమో...ఏదిపడితే అదే విమర్శిస్తున్నారు. కాంగ్రెస్ ఆరోపణలను తిప్పికొట్టవచ్చన్న భావన కావచ్చు. తెలంగాణ ఉద్యమంలో కీలకమైన నీళ్ల అజెండాతోనే మళ్లీ వెళ్లాలని.. కాళేశ్వరం విషయంలో తాము చేసిన కృషిని తక్కువ చేస్తున్న ప్రభుత్వ వైఖరిని తప్పు పడుతూ ప్రజల్లోకి వెళ్లాలని నిర్ణయించడం కూడా కావచ్చు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే తెలంగాణ ఉద్యమం నాటి నినాదం మరోమారు తెరపైకి వచ్చింది. ఉద్యమ కాలం నాటి నీళ్లు, నిధులు, నియామకాలు నినాదం ఇప్పుడు మార్మోగిస్తున్నారు. పదేళ్లతో దానికి పాతర వేసిందే బిఆర్ఎస్. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటై దశాబ్దం కావొస్తున్నా ఉద్యమ కాలం నాటి నీళ్లు, నిధులు, నియామకాలు సాకారం కాలేదన్నది జగమెరిగిన సత్యం. ఎందుకంటే కెసిఆర్ పాలనలో కాళేశ్వరం కట్టి కల్లబొల్ల ఇకబుర్లు చెప్పారు. తెలంగాణ ప్రజలు అంతా ధనవంతులయ్యారని, ఎకరా భూమి ఎక్కడా 30 లక్షలకు తక్కువ లేదని నమ్మ బలికారు. ఇలా ఉద్యమ ఆకాంక్షలను నెరవేర్చామని పదేళ్లుగా ప్రచారంలో ప్రజలను ముంచారు. కాళేశ్వరం ప్రాజెక్టు లోపాలపై కాంగ్రెస్ బీఆర్ఎస్‌ను లక్ష్యంగా చేసుకొని విమర్శలు చేయడంతో పదేళ్ల అధికార మత్తులో ఉన్నవారి కళ్లు బైర్లు కమ్ముతున్నాయి. గతంలో అధికారంలో ఉండగా మేడిగడ్డకు ఒక్కరిని కూడా పోకుండా పోలీసులను కాపలా పెట్టింది. కాళేశ్వరంప్రాజెక్టులో కీలకమైన మేడిగడ్డ బ్యారేజీ ఎన్నికలకు ముందు కుంగిపోయిన విషయం వెలుగు చూసింది. అప్పటినుంచి రాష్ట్ర రాజకీయాల్లో ఈ వ్యవహారం హాట్ టాపిక్‌గా మారింది. ఈ క్రమంలోనే రాష్ట్రంలో అధికారం లోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ... బీఆర్ఎస్ వైఖరిని ఎండగట్టేందుకు అసెంబ్లీలో సాగునీటి ప్రాజెక్టులపై శ్వేత పత్రం విడుదల చేసింది. 'కాళేశ్వరం ఓ విఫల ప్రాజెక్టుగా ఎత్తిచూపింది. బీఆర్ఎస్ ప్రభుత్వం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని తెలంగాణ ప్రజానీకానికి తెలియచేసింది. మొత్తంగా అనేక విషయాల్లో బిఆర్ఎస్ ఎదురుదాడికి గురవు తోంది. పాపాలు బద్దలవుతున్నాయి. అందుకే నిజాలు మరచి సొరంగ ప్రమాదంపై ఇష్టం వచ్చినట్లుగా విమర్శలుచేస్తూ అభాసుపాల య్యారు. స్థానిక ఎన్నికల్లో బిఆర్ఎస్‌ను ప్రజలు ఆదరిస్తే ఉంటారు.. లేకుంటా కాలగర్భంలో కలసిపోతారు. రాజకీయ అవినీతికి పాల్పడే పార్టీలను ప్రజలు ఎప్పటికప్పుడు గుర్తించి తగిన శాస్తి చేసతేనే రాజకీయాలు మలినం కావు.

# కుంభమేళాకు హాజరుకాకపోవడంపై నేతల మధ్య మాటల యుద్ధం



న్యూఢిల్లీ,కుంభమేళా, అయోధ్య కార్యక్రమానికి హాజరు కాకపోవడంపై బీజేపీ వర్సెస్ కాంగ్రెస్ మధ్య మరోసారి మాటల యుద్ధం నడుస్తోంది. ప్రధాని మోడీ గుజరాత్‌లోని సోమనాథ్ ఆలయాన్ని సందర్శించిన సందర్భంగా కాంగ్రెస్‌పై బీజేపీ మాటల దాడి చేసింది.కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాహుల్‌గాంధీ, మల్లిఖార్జున ఖర్గేలను లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పించింది. 2024లో అయోధ్య రామాలయ ప్రారంభోత్సవానికి హాజరకాలేదు. 2025లో మహా కుంభమేళాకు కాంగ్రెస్ నాయకులు హాజరుకాలేదని.. వాళ్లంతా హిందూ వ్యతిరేకులని బీజేపీ ధ్వజమెత్తింది. ఈ మేరకు ట్విట్టర్ వేదికగా ఫొటోలు పెట్టి విమర్శలు చేసింది."రాహుల్ గాంధీ కుటుంబం మొత్తం హిందూ మతాన్ని వ్యతిరేకిస్తుంది. వారు బాబర్ (అయోధ్యలోని బాబ్రీ మసీదు) నిర్మించిన మసీదుకు మూడుసార్లు వెళ్లారు కానీ రామది ఆలయంలో శ్రీరాముని దర్శనం కోసం వెళ్లలేదు. రాహుల్ గాంధీ తరచుగా రాయ్‌బరేలికి వెళ్తారు. కానీ ఆయన ప్రయాగ్‌రాజ్ మహా కుంభమేళా జరిగే ప్రదేశానికి వెళ్లలేకపోయారు. ఇది కేవలం 2 గంటల రెండు నిమిషాల 120 కి.మీ. దూరంలో ఉంది" అని బీజేపీ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారి పేర్కొన్నారు.ఇక హిందీ పోస్టులో బీజేపీ మరో విమర్శ చేసింది. "శతాబ్దాల పోరాటం మరియు నిరీక్షణ తర్వాత అయోధ్యలో ఒక గొప్ప రామాలయం నిర్మించబడింది. మోడీ చేతుల మీదుగా జనవరి 22, 2024న రామ్‌లాలా ప్రాణ ప్రతిష్ట జరిగింది. కానీ ఆలయ నిర్మాణాన్ని ఎప్పుడూ వ్యతిరేకించే కాంగ్రెస్, రాహుల్ గాంధీ ఆహ్వానం అందుకున్న తర్వాత కూడా వేడుకకు హాజరు కాలేదు. కాంగ్రెస్ తన ఓటు బ్యాంకును సంతృప్తి పరచుకోవడా నికి హిందువుల మనోభావాలను ఎప్పుడూ దెబ్బతీస్తుంది" అని బీజేపీ పేర్కొంది.బీజేపీ విమర్శలను మల్లిఖార్జున ఖర్గే కుమారుడు ప్రియాంక్ ఖర్గే ఖండించారు. బీజేపీ వాదన ప్రకారం.. బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్, కేంద్రమంత్రి హెచ్‌డీ కుమారస్వామి వంటి మిత్రపక్షాల నాయకులు కూడా కుంభమేళాకు హాజరుకాలేదు. వీళ్లను కూడా హిందూ వ్యతిరేకులుగా పరిగణించాలా? అని బీజేపీని ప్రశ్నించారు.

### కడుపు నొప్పి పేరుతో పోసాని డ్రామా: సిఐ

రాజంపేట,కడుపు నొప్పి పేరుతో పోసాని డ్రామా ఆడారని రైల్వేకోడూరు సిఐ తెలిపారు, రాజంపేట సబ్‌జైలులో ఉన్న పోసాని కృష్ణమురళి స్వల్ప అస్వస్థత గురయ్యారని,ఆయనను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే దీనిపై రైల్వే కోడూరు రూరల్ సిఐ వెంకటేశ్వర్లు మీడియాతో మాట్లాడారు.

# ఆ భయంతో.. సునీల్‌కుమార్‌పై వేటు కాస్త ఆలస్యం!

విజయవాడ:సీఐడీ మాజీ చీఫ్ పీవీ సునీల్‌కుమార్‌పై సస్పెన్షన్ వేటు ఖాయమై చాలా రోజులైంది. ఒకవైపు డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు ఇంకా ఎందుకు సస్పెండ్ చేయలేదంటూ మీడియాకెక్కి రచ్చ చేయడం తెలిసిందే. కూటమి ప్రభుత్వ నిర్ణయాలకు లెక్కలుంటాయి. ఆ లెక్కలో భాగంగానే తాజాగా సునీల్‌కు మార్‌పై సస్పెన్షన్ వేటు పడిందన్న చర్చకు తెరలేచింది.దళితుడైన పీవీ సునీల్‌కుమార్‌పై చర్యలు తీసుకోడానికి నెలల పాటు కూటమి ప్రభుత్వం వేచి చూడడానికి ప్రత్యేక కారణం లేకపోలేదు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో దళితుల వ్యతిరేకతను ఎదుర్కోవాల్సి వస్తుందన్న ఏకైక భయంతోనే సునీల్‌పై ఆచితూచి ప్రభుత్వం అడుగులు వేసింది. ఉమ్మడి కృష్ణా-గుంటూరు, అలాగే ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు పూర్తయిన వెంటనే ఆయనపై చర్యలు తీసుకోవడం గమనార్హం.పీవీ సునీల్‌కుమార్‌కు దళితుల్లో మంచి పట్టు వుంది. దళిత మిషనరీకి సంబంధించి సారథ్యం కూడా వహిస్తున్నట్టు తెలిసింది. తరచూ దళితులతో సమావేశాలు నిర్వహిస్తూ, జాతి పురోగతి కోసమని ప్రసంగాలు ఇస్తుంటారు. ముఖ్యంగా మాల సామాజిక వర్గంలో ఆయనకు బ లమైన వర్గం వుంది. ఈ కారణం రీత్యా ఆయనపై వేటు విషయంలో ప్రభుత్వం కాస్త సమయం తీసుకుంది. అది కూడా రఘురామ కస్టోడియల్ కేసులో ఆయన్ను సస్పెండ్ చేయకపోవడాన్ని గమనించొచ్చు.ప్రభుత్వ అనుమతి తీసుకోకుండా



విదేశాలకు వెళ్లారనే ఆరోపణలపై చర్యలు తీసుకోవడం విశేషం. రఘురామ ఎపిసోడ్‌లో చర్యలు తీసుకుంటే క్షత్రియుడి కోసం తమ సామాజిక వర్గానికి చెందిన ఉన్నతాధికారిపై వేటు వేశారనే ఆగ్రహం దళితుల్లో వచ్చిందనే భయంతో కూటమి సర్కార్ జాగ్రత్తలు తీసుకున్నట్టు కనిపిస్తోంది. రఘురామ కోరుకున్నట్టుగా సునీల్‌పై చర్యలు తీసుకున్నా, తన కేసుకు సంబంధం లేని వ్యవహారంలో కాకపోవడంతో డిప్యూటీ స్పీకర్ మనసులో అసంతృప్తి వుంటుందేమో!

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com